## క్లుప్తంగా

### మెగా వైద్య శిబిరం

**నవీపేట:** జిల్లా కేంద్రంలోని ప్రతిభా ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని చావిడిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నవీపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వైద్యులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జన వికాస్‌సేవా సమితి జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, మాజీ ఎంపీపీ సూరిబాబు, నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, వైద్యులు ప్రతిభ, సామ రాజశేఖర్‌రెడ్డి, సాయి హరీష్, రఘువరణ్, వంశీధర్‌రెడ్డి, నిరూప్‌రెడ్డి, అపర్ణ, సిబ్బంది లింగోజి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వర్ని:** మండలంలోని జలాల్పూర్ 33/11 విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఈ నెల 16 నుండి 19 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ వెల్లడించారు. సబ్ స్టేషన్ పరిధిలోని జలాల్పూర్, సైదిపూర్, రాజీపేట్, బడాపహాడ్, పులి క్యాంపు, కూనిపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరాకు కలిగే అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు. తాత్కాలికంగా కూనీపూర్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

### సర్కార్ బడిలో కార్పొరేట్ విద్య



**బాల్కొండ:** సర్కార్ బడిలో కార్పొరేట్ పాఠశాలలకు దీటైన విద్యను అందిస్తున్నామని బాల్కొండ ఎంపీవో రాజేశ్వర్ అన్నారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకే పిల్లలను పంపించాలని కోరారు.

**కుకునూర్‌లో..**

**వేల్పూర్:** కుకునూర్‌లో స్థానిక ఉన్నత, ప్రైమరీ స్కూళ్ల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ప్రైవేటుకు ధీటుగా ఇంగ్లీషు మీడియం విద్యా బోధన, శిక్షణ పొందిన సీనియర్ ఉపాధ్యాయుల ద్వారా అన్ని పాఠ్యాంశాల్లో పిల్లలు పట్టు సాధించేలా బోధిస్తామని తల్లిదండ్రులకు చెప్పారు. ఎటువంటి ఫీజుల భారం ఉండదని, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, డ్రెస్సులు ఉచితంగా లభిస్తాయని చెప్పారు. హెచ్‌ఎంలు టి.హరిచరణ్, హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

**బాల్కొండ:** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని బాల్కొండ ఎస్సై నరేష్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ బుధవారం ఫిర్యాదు చేశారు. పారిశ్రామికవేత్తలు, బిల్డర్లు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చటానికి సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించినందుకు వెంటనే కేసు నమోదు చేయాలన్నారు. అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిట్యాల శ్రీనివాస్ ఉన్నారు.

### సెల్‌ఫోన్ల అప్పగింత



**రుద్రూర్:** రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న సమక్షంలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ.. ఆధుని క సాంకేతికతను వినియోగించి పోగొట్టుకున్న ఫోన్‌లను గుర్తించవచ్చునని అన్నారు. మొబైల్ దొరికిన తర్వాత అన్ లాక్ చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుందని అన్నారు. ఇప్పటివరకు రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 50 మంది ఫోన్లను గుర్తించి యజమానులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎస్సై సాయన్న, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



**కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని మిసిమి హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న యెనుగందుల సామిత్ అనే విద్యార్థి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. మార్చి 2న హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో స్టేట్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సామిత్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో సామిత్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటాడని కరస్పాండెంట్ తెలిపారు. సామిత్‌ను అభినందించారు.

# వడ్డీలకే ఖజానా ఖాళీ

- మంత్రి జూపల్లి కృష్ణా రావు
- మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన



గుండ్ల చెరువు మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆర్మూర్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలో బుధవారం మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలకు తులం బంగారం, రూ.2 లక్షల రైతు రుణ మాఫీ సైతం త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద రూ.4 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్,ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయి బాబా గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, తదితరులు ఉన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక**

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలో బుధవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి నేతృత్వంలో 35వ మాజీ వార్డు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ సడక్ వినోద్‌తో పాటు పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి జూపల్లి కృష్ణారావు.. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. యువజన పట్టణ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు కిరణ్ అల్జాపూర్ తదితరులున్నారు.

**ప్రతి హామీని నెరవేరుస్తాం**

**మోర్తాడ్(బాల్కొండ):** ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ మంత్రి వర్గం కృత నిశ్చయంతో ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు కుండబద్దలు కొట్టి చెప్పారు. బుధవారం భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం వ్యవహరించిన తీరువల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి సీఎం కృషి చేస్తూనే ఉన్నారని చెప్పారు.

**బాల్కొండ సమస్యలపై స్పందించండి**

బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే వినతి పత్రం అందించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కమ్మర్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ దేవేందర్



వెంచిర్యాల్‌లో.. ఎంపీడీవో ఆనంద్ నరేశ్

**కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, ప్యాక్స్ చైర్మన్ రేగుంట దేవేందర్‌లు ప్రారంభించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు రవి, నర్సారెడ్డి, గడ్డం స్వామి, మహేందర్, రేని విజయ్, శైలేందర్, సీఈవో శంకర్ పాల్గొన్నారు.

**బాల్కొండ:** ముప్కాల్ మండలం వెంచిర్యాల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో ఆనంద్ నరేశ్ ప్రారంభించారు. ఏపీఎం ప్రసాద్‌రావు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపల్లిలో..**

వేంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి ప్రారంభించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

**కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి**

**బోధన్‌రూరల్:** బోధన్ సొసైటీ పరిధిలో వరిధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్న సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య అన్నారు. బుధవారం బోధన్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు సాయిలు, గంగాధర్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.



బోధన్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న పుట్ట వరదయ్య

### సిద్ధుల గుట్ట సందర్శన

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయాన్ని బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పూర్వ అధ్యక్షుడు పుల్లారెడ్డి స్వీట్స్(హైదరాబాద్) అధినేత ఏకాంబర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు ఏకాంబర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్, కార్యదర్శి రాస ఆనంద్, రోటరీ మాజీ గవర్నర్ హన్మంత్ రెడ్డి, కాంతి గంగారెడ్డి, చరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఒకే దేశం- ఒకే ఎన్నికపై అవగాహన



**ఆర్మూర్‌టౌన్:** బీజేపీ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఒకే దేశం- ఒకే ఎన్నికపై పట్టణంలోని గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే ఎన్నిక వల్ల ఎన్నికల ఖర్చు తగ్గించడం, పాలనా వ్యవస్థపై ఎన్నికల ప్రభావం తగ్గించటం లాంటి జరుగుతాయన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యక్రమం కన్వీనర్ పులి యుగేందర్, మందుల పోశెట్టి, ఆకుల రాజు, విజయ్ ఆనంద్, ఆరె రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

### శివపార్వతుల కల్యాణోత్సవం

**కమ్మర్‌పల్లి:** బషీరాబాద్‌లో కాడి చెరువు గంగామాత ఆలయంలో బుధవారం శివ పార్వతులు, గంగామాత కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంగామాత జాతరోత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను పురోహితుడు కృష్ణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, తదితరులు పాల్గొని గంగామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

### వీడీసీల వివక్షను అరికట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

**పెర్కిట్(ఆర్మూర్):** మోర్తాడ్ మండలం తాళ్ల రాంపూర్‌లో కల్లు గీత కార్మికులపై వీడీసీ వివక్షను అరికట్టాలని కోరుతూ ఆలూర్ మండల సీపీఎం కార్యదర్శి ఈడగొట్టి సాయిలు ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఆలూర్ తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. శ్రీరామ నవమి రోజున గీత కార్మికుల కుటుంబాలకు చెందిన మహిళలను దేవాలయంలో కుంకుమార్చనకు నిరాకరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తాళ్ల రాంపూర్‌లో ఈత వనాన్ని తగులబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ నెల 22న చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు.


## సమాన పనికి సమాన వేతనం అందజేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఎల్లయ్య

**పెర్కిట్(ఆర్మూర్):** ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఎండీఎం కార్మికుల సాధారణ స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ల య్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎండీఎం కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇవ్వాలన్నారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎండీఎం కార్మికుల మండల అధ్యక్షురాలిగా స్వరూప, కార్యదర్శిగా జక్కం సుజాత, ఉపాధ్యక్షురాళ్లుగా జయ, షాహీద్ సుల్తానా, దయామని, సహాయ కార్యదర్శిగా లక్ష్మీ, కోశాధికారిగా శంకర్ ఎన్నికయ్యారు.

## విద్యార్థుల సంఖ్య పెంచడమే ‘రైడ్స్’ లక్ష్యం



మాట్లాడుతున్న రైడ్స్ అధ్యక్షుడు కృష్ణ

**రుద్రూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ(రైడ్స్) లక్ష్యమని సభ్యులు పేర్కొన్నారు. రుద్రూర్ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం రాత్రి సమావేశమై రైడ్స్ సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. సంస్థ గౌరవ అధ్యక్షుడిగా మామిళ్ల చంద్రశేఖర్ గౌడ్, అధ్యక్షుడిగా కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పార్వతి శేఖర్, ఉపాధ్యక్షులుగా నూతిపల్లి బాలరాజు, ఉప్పు అశోక్, ఈరపురం సాయిలు, కోశాధికారిగా చిదుర మహిపాల్‌ను ఎన్నుకున్నారు. రైడ్స్ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాల గురించి చర్చించారు.

### ‘చలో ఆర్మూర్’కు నేతల పిలుపు

**ఆర్మూర్‌టౌన్:** వీడీసీల పేరుతో కులవృత్తులపై దాడులు, బహిష్కరణలను తీవ్రంగా ఖండిస్తున్నామని జేఏసీ నాయకులు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో బుధవారం జేఏసీ అధ్యక్షుడు సావేల్ గంగాధర్ అధ్యక్షతన వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ... గ్రామాల్లో బలహీన వర్గాలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 29న ఆర్మూర్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీల ఐక్యతా ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. నాయకులు ప్రభాకర్, రాజారాం యాదవ్, దేగాం యాదగౌడ్, నర్సింహాచారి, దేవారం, లింగాగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

### డివిజన్ స్థాయి జీపీ కార్యదర్శులకు శిక్షణ

**బోధన్:** పట్టణ కేంద్రంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో బుధవారం బోధన్ డివిజన్ స్థాయి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పాలన- రికార్డుల నిర్వహణ అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పంచాయతీ శాఖ ప్రాజెక్టు మేనేజర్ నరహరి, డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడారు. గ్రామ పంచాయతీల పరిధిలోని రికార్డుల నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని వారు సూచించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి తమ పరిధిలోని వాటిని పరిష్కరించాలన్నారు.

### కల్యాణ మండపం ప్రారంభోత్సవం



**బోధన్:** సాలూర మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా కల్యాణ మండపాన్ని నిర్మించారు. బుధవారం సంప్రదాయబద్ధంగా కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా యజ్ఞం చేశారు. లింగాయత్ సమాజ్ గ్రామ అధ్యక్షుడు శివపూజ శంకర్, ప్రతినిధులు గంటీ వీరేష్, బాగే శ్రీకాంత్, బండే శివరాజ్, శివాలయం కమిటీ చైర్మన్ లోకప్పగారి లక్ష్మణ్, అర్చకులు తిప్పయ్యప్ప స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

### ఎఫ్‌ఏలకు వేతనాలు చెల్లించాలి

**కమ్మర్‌పల్లి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో, తహసీల్దార్‌లకు వినతి పత్రం అందజేశారు. తమను ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హరీష్, రమ, పీర్య, అశ్వపతి, లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### చిత్రపటాలకు పాలాభిషేకం



**వేల్పూర్:** పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్ వరకు డబుల్ రోడ్డు మంజూరుకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రూ.5 కోట్ల 88 లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. బీఆర్‌ఎస్ నాయకులు రేగుల్లరాములు, బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, మొండి మహేశ్, భోజన్నయాదవ్, నరేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**రెంజల్(బోధన్):** మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. దూపల్లిలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణం, విండో గోదాంకు రూ.10 లక్షలతో నిర్మించే పనులను ఆయన బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయంతో సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే బోనస్ రాదని రైతులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు మహిళలు ఆయన దృష్టికి తీసుకరాగా విండో సిబ్బందిపై మండిపడ్డారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నేతలు నాగభూషణంరెడ్డి, భూంరెడ్డి, సాయరెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

**‘ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోంది’**

**ఎడపల్లి(బోధన్):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం జానకంపేట్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు సిమెంటు రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అన్ని గ్రామాలలో త్వరితగతన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి మంజూరు చేస్తామన్నారు. మంచినీటి సమస్య ఏర్పడకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతిరెడ్డి రాజిరెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నాయకులు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, జక్కం బాలింగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి



నందిపేటలో టీకాలు వేస్తున్న డాక్టర్ రోహిత్‌రెడ్డి

**నందిపేట్(ఆర్మూర్):** జాతీయ వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులన్నింటికీ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖాధికారి రోహిత్‌రెడ్డి సూచించారు. నందిపేట మండల కేంద్రంలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో, విజయ నగరం గ్రామాలలో ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ శిబిరాన్ని ప్రారంభించారు. మే 15 వరకు గ్రామాలలో గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని ఆయన తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ డైరెక్టర్ గంగాధరయ్య, పశు వైద్యాధికారి నితీష్ పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** పాడి రైతులకు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని బోధన్ పశుసంవర్ధక శాఖ వైద్యులు సురేష్ అన్నారు. బుధవారం బోధన్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వీఎల్‌వో నారాయణ, ఎల్ఎస్ఏ శ్రీనివాస్, వీఏ నాగభూషణం, గోపాలమిత్ర ప్రతినిధులు ఆజ్మత్, పోశెట్టి, ఆరిఫ్ పాల్గొన్నారు.

**మాక్లూర్:** కృష్ణానగర్‌లో బుధవారం జిల్లా పశు వైద్యాధికారి రోహిత్ రెడ్డి, మండల పశు వైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, ఉమా షహర్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి గంగాధరయ్య, సిబ్బంది వినీత, అహ్మద్ పాషా, కల్యాణి, పుష్ప, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ లీకైతే భయపడొద్దు



నందిపేటలో సిలిండర్ మంటలు ఆర్పే విధానం గురించి వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఆర్మూర్ పట్టణంలో.. అధికారి మధుసూదన్‌రెడ్డి

**నందిపేట్(ఆర్మూర్):** వంట గ్యాస్ సిలిండర్ లీకైతే ఆందోళన చెందకుండా చిన్న చిట్కాతో ప్రమాదం నుంచి బయటపడొచ్చని అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్‌రావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం నందిపేట మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వంట గ్యాస్ సిలిండర్ల ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది నరేష్, సురేష్, శారజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి**

**ఆర్మూర్‌టౌన్:** అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన చెందకూడదని లేకుంటే అతి తక్కువ సమయంలోనే భారీ నష్టం సంభవించవచ్చని అగ్నిమాపక శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో రైస్‌మిల్లు యాజమనులకు, సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం పెట్రోల్ పంపులలో, ఎల్‌పీజీ గోదాములలో అవగాహన కల్పించారు.

### సాంబయ్యగుడి పునర్నిర్మాణానికి భూమిపూజ



నందిపేటలో పురాతన గుడి గోడలను పెకిలిస్తున్న మంగిరాములు మహరాజ్

**నందిపేట్(ఆర్మూర్):** మండల కేంద్రంలోని రాజనగర్ కాలనీలో వందల సంవత్సరాల క్రితం నిర్మించిన సాంబయ్యగుడి పునర్నిర్మాణం కోసం బుధవారం కేదారీశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ భూమిపూజ నిర్వహించారు. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణలో బ్రహ్మణోత్తములతో యాగం చేశారు. గోపూజ చేసి ఆలయంలోని విగ్రహాలను తీశారు. అనంతరం పురాతన ఆలయాన్ని మంగి రాములు మహారాజ్ చేతుల మీదుగా పెకిలించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

### సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

| | |
|---|---|
| స్క్రీన్-1 | అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు) - 10.00, 1.05, 7.15, 10.20, ఫలక్‌నుమా దాస్(తెలుగు)-4.10 |
| స్క్రీన్-2 | జాక్(తెలుగు)-10.50, 1.45, 4.40, 7.35, 10.30 |
| స్క్రీన్-3 | ద మమ్మీ (తెలుగు)-12.20, 2.50, 5.20, 7.50, 10.20 |
| స్క్రీన్-4 | గుడ్‌బ్యాడ్ అగ్లీ (తెలుగు)-10.30, 1.25 7.05, 10.0, మ్యాడ్ స్క్వేర్(తెలుగు) -4.20 |



### మాంసం ధరలు(రూ..)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్స్‌డ్ | 200 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 94,200 | వెండి(కిలో) | 101,000 |
| 22 క్యారెట్స్ | 86,950 | | |

- నిజామాబాద్ బిజినెస్